కథా నిలయం
3518
శ్రీకాకుళం



# తండ్రి - తాత

అధమం పదేళ్ళయినా పిల్లలు కలగకుండా వుంటే బాగుండునని మొదట్లో రామం అనుకోకపోలేదు! అలాగయినా జీవితంలో ఆనందాన్ని ఏ బెడదా లేకుండా పొందవచ్చుని. అలాగని రామానికి పిల్లలంటే ఇష్టం లేకపోనూ లేదు. చిన్నవాళ్ళంటే ఆయనకి తగని ప్రేమ. ఎవ్వరైనా ఇంటికొస్తే వుట్టినే పోనిచ్చేవాడు కాదు. భార్య కాపరానికి వచ్చిన ఆరు నెలలకే నెల తప్పినా, అప్పట్లో రామం కొంచెం అనుకున్నా అంతగా పట్టించుకోలేదు. నెలలు దగ్గిరవుతున్న కొద్దీ ఏదో చెప్పరాని సంతోషాన్ని అనుభవిస్తూనే వున్నాడు. రోజు రోజుకు భార్యలో వచ్చే మార్పుని చూస్తూ ఆనందిస్తున్నాడు. ఆ సంగతి తనకి తెలిసినప్పటినుండి పెద్దవాళ్ళెవరూ చెప్పడానికి లేకపోయినా రోజూ భార్యకు ఏది ఇష్టమో అతనే ఆలోచించుకొని అవి తెస్తున్నాడు. ఆమె ఓనాడు, ''ఎందుకివన్నీ మీకేం చాదస్తమా?'' అని అడిగేటప్పటికి ఎలాగో సముదాయం చేసేడు. ఇవన్నీ చూసి ఆమె ఆశ్చర్యంతో నవ్వుకుంది.

ఏడో నెల రాగానే ఆచారం ప్రకారం అత్తగారు భార్యని తీసుకుపోడానికి వచ్చినపుడు మనస్సు చివుక్కుమన్నా తీసుకువెళ్ళి పోతూంటే నోరెత్తలేకపోయాడు. ఆ తర్వాత వారం వారం వెళ్ళి చూస్తూనే వున్నాడు కూడా. భార్యని పంపించిన తరవాత రామానికి మనసు మనసులో లేదు. ఆ ఏకాంతాన్ని భరించలేకపోతున్నాడు. ఆ ఇంట్లో ఒక్క ఘడియ అయినా వుండడానికి మనస్కరించలేదు. కాని ఏం చేయగలడు? తప్పనిసరి. ఎలానో తమాయించుకొని వూరుకొనేవాడు. ఒక్కొక్కప్పుడు తన వాళ్ళని పిలిపించుకొని తన ఇంట్లోనే ఆమెను వుంచుకొని వుంటే ఎంత బాగుండేదో అని అనుకొనేవాడు. కాని వాళ్ళకు మాత్రం ఆ ఆశ వుండదా అని వూరుకుంటూంటాడు. తనకేమీ తోచనప్పుడల్లా ఆవు దగ్గరకు వెళ్ళి కూర్చుంటాడు. ఆవుని చూసినప్పుడల్లా తన భార్య జ్ఞాపకం వస్తుంది. ఎందుకంటే ఆ ఆవు కూడా చూలుంది భార్యకి నెలల నిండే రోజులూ ఆ ఆవుకూడా కనే రోజులూ. రెండు మూడు రోజులు తేడాలోనే వుంటాయి. తన భార్య వెళుతున్నప్పుడు గూడా ఆవుని చూపిస్తూ ''జాగ్రత్తసుమండీ. వేళకి సమంగా గడ్డీ, దాణా, పెడుతూండండి'' అని చెప్పి మరీ వెళ్ళింది. ఆ ఆవు ఏమాత్రం బాధపడుతున్నట్టు అవుపించినా తనూ అనుకొనేవాడు ఆమె ఎలా వుందో అని.

ఇలా రోజులు వెళుతున్నాయి. ఒక రోజు రామం ఇంటికి రాగానే ఆవుని చూడ్డానికి వెళ్ళేడు! ఆ వేళ ఆవు చాలా మందంగా వుంది. అటూ ఇటూ ఘాబరాతో ముట్టె ఆనిస్తూ, తోక విసురుతూ, ఇలా నానా అవస్థా పడుతున్నది. రామం దగ్గరగా వెళ్ళి ఏదో ఆలోచిస్తూ గంగడోలు దువ్వుతున్నాడు. ఇంతలో ఆవు కాసేవాడు వచ్చి చూసి, ''లెండి బాబూ అక్కడ, ఆవు ఈనుతుంది'' అన్నాడు. రామానికి ఎంతో సంతోషం కలిగింది పోయి నవ్వుతూ ఎడంగా నిలుచున్నాడు. కొంత సేపటికి

నల్లని పెయ్యని కన్నది. ఆవు వెంటనే పెయ్యని తెగనాకడం మొదలుపెట్టింది. అప్పటి కప్పుడే తడబిడ పడుతూ తప్పటడుగులు వేయబోయి తూలి పడుతూ లేస్తూంది పెయ్య. ఆవు యింకా నాకడం మానలేదు. ఆ వాత్సల్యం, సమస్త సృష్టిలోని జీవాల్లోనూ ఒక్కలాగే వుంటుంది కాబోలని అనుకున్నాడు రామం. పాలికాపూ, రామం పెయ్యగోళ్ళు తీస్తున్నారు. వాటిని ఆవు తినేస్తూంది కొంత వరకూ సంరక్షణ చేయగా పెయ్య పూర్తిగా నిలుచుంది. పాలకోసం తల్లి కాళ్ళ దగ్గరకి వచ్చి పొదుగు దొరకక తణుకు లాడుతూంది. పాలికాపు పెయ్యనోటిలో వేలు పెట్టి పాలు కుడవడం నేర్పుతున్నాడు. రామం-అనుకున్నాడు- అప్పుడే దీనికి పొదుగు కాళ్ళ దగ్గరే వుంటుందని ఎలా తెలుసును ? అవి - భగవంతుని సృష్టిలోని ఈ విచిత్రాన్ని చూసి ఎంత ఆశ్చర్య పడ్డాడో ఆ రామానికే తెలియాలి !

ఆ మర్నాడే జున్ను పట్టుకొని బయలు దేరాడు భార్య దగ్గిరికి. బండి దిగి యింటికి వెళ్ళేడు. ఇంట్లో ఎక్కడా గట్టిగా మాటలు లేవు. లోపలికి మెల్లిగా వెళ్ళేడు. గదిలో భార్య పడుకొని వుంది. అటూ ఇటూ చూశాడు. అంతా నిశ్శబ్దంగా వుంది. అత్తగారూ వాళ్ళూ పెరట్లో వున్నట్టున్నారు. మెల్లిగా వెళ్ళేడు. ఆమె దగ్గరికి. ఇతన్ని చూసి ఆమె బరువయిన కంటి రెప్పల్ని కొంచెం మీది కెత్తుతూ చిన్న నవ్వు నవ్వి, కొంచెం జరిగింది.

''ఏం పడుక్కున్నావు ? ఒంట్లో ఎలా వుంది'' అని అడిగేడు అనుమానాస్పదంగా- ''ఏం లేదండి. వూరికనే'' అని సిగ్గుతో ముఖం అవతలకి తిప్పేసుకుంది ఆవిడ.

''అలాగా ! చెబుదూ !'' అన్నాడు గడ్డం పట్టుకొని యివతలకి తిప్పుతూ.

ఇలా అంటూండగా అత్తగారు వస్తూన్న చడి విని రామం తప్పుకున్నాడు.

''ఓహో రామం ! ఎప్పుడొచ్చేవు ?'' అని పలకరించింది అత్తగారు.

''ఇప్పుడేనండీ ! మన ఆవు నిన్ననే ఈనింది ఆడపెయ్య. జున్ను దీనికి యిష్టమని తెచ్చేను'' అని అన్నాడు.

అది విని అతని భార్య, ఆనందంతో ''ఆడపెయ్యా! ఎలా వుంటుంది ?'' అంది యిటువేపు వొత్తిగిల్లి -

''నల్లగా నీలాగే వుంటుంది'' అన్నాడు నవ్వుతూ -

''పోనీలే నాయనా ! నీ కొడుకో, కూతురో పుట్టబోయే పిల్లకి నీ పోలికే వచ్చి తెల్లగా చంద్రం బొమ్మలా మెరుస్తూంటుందిలే'' అని అత్తగారు ఎత్తిపొడిచింది. భార్య వేపు తిరిగి రామం -

''ఊహూ అలాగా '' అంటూ అవతలకి తిరిగాడు.

''మామగారు ఏరీ అని అతడడిగే టప్పటికి, -

''మంత్రసాని కోసం వెళ్ళేరు నాయనా ! పిల్ల బరువు పడ్డాది. వుదయం నించీ ఎలా వుంటుందో - ఏ నిముషానికో ! అని పిలవడానికి వెళ్ళేరు'' అని ఆవిడ చెప్పి పెరట్లోకి వెళ్ళిపోయింది. రామం మళ్ళీ భార్య దగ్గరి కెళ్ళి చూశాడు. ఆమె కొంచం బాధపడుతున్నట్టనిపించి అడగాలనుకొనేసరికి ఇతణ్ణి చూసి ఆమె ఆ బాధ పైకి కనపడనీకుండా అణచుకొంటూ కూర్చోమని సంజ్ఞ చేసింది. అప్పుడే చేతికున్న గాజులు గలగల లాడేయి. ఆ శబ్దాన్ని విని రామం పొంగిపోయాడు. ఆ చెయ్యిని మెత్తగా

నిమురుతూ -

''ఏం ఎలాగుంది ?'' అని అడిగేడు.

''అబ్బే ఏమీ లేదండీ. మీరలా తిరిగి రద్దురూ ఇక్కడెందుకూ '' ఇలా రావద్దు!'' అని ఆయాసంతో అంది.

''ఏం అలా అంటున్నావు. నే వుండరాదా ?'' అని తల నిమురుతూ అడిగాడు.

''అబ్బే దానికి కాదు! నాకదోలా వుంటుంది. అలా తిరిగి రండూ !''

''అలాగే కాని ఒంట్లో ఎలా వుందో నిజంగా చెప్పు!''

''ఏదేమిటో భయం వేస్తోందండీ ?'' అని కళ్ళంట నీరు పెట్టుకుంటూ రెండు చేతుల ముఖం కప్పుకొని రామం వేపు చూడలేకపోయింది.

''ఏదేమిటి తప్పు! ఏడుస్తావా ? యింకేముంది. అలా చెప్పకూడదు! కొంచెం ఓర్పుగా వుండాలి! నేను వున్నాను కదూ! యిటు చూడూ! అన్నట్టు నువ్వు నెయ్యి [illegible]ంటున్నావు ....'' అని ఆమెను ఓదారుస్తూ మాటలు మార్చేశాడు. -

''జాగ్రత్తగా చూడమని చెప్పి వచ్చారా ?'' అని కళ్ళు తుడుచుకుంటూ అడిగింది.

''నాకు తెలుసూ !''

అని అంటూ అంటూండగానే ఆయన మామగారు వచ్చారు. భయం లేదని చెప్పి రామం ఇవతల కొచ్చేశాడు. రామాన్ని ఆయన పలకరించి తన పనిలో తాను మునిగేటప్పటికి రామం ఏమీ తోచక అటూ యిటూ తిరుగుతున్నాడు. మంత్రసాని లోపలికి వెళ్ళనే వెళ్లింది కూడ

రామం యిలా ఆలోచిస్తూ పరధ్యానంగా వున్నాడు. తనకి తెలియని, వేదన, ఆతృత, అతణ్ణి వశం చేసుకుంటున్నాయి. యింతలో - గదిలో చిన్నపిల్ల ఏడుపు విని, ఒక్కసారి గతుక్కుమన్నాడు, తనకి తెలియకుండా నవ్వు వచ్చింది. గబగబా యింట్లోకి వెళ్ళిపోయాడు. ఎందుకోగాని జంకి వూరుకున్నాడు. చేతినున్న వాచీ చూశాడు. సమంగా పదిన్నర అయింది.

''మనవరాలండోయ్!'' అని లోనుండి అత్తగారు కేక వెయ్యడం యివతల మామగారు పంచాంగం చూస్తూండడం ఒక్కసారే జరిగేయి. రామానికి సంతోషంతో సహా ఆతృత మరీ లావయింది. భార్యని ఆ సమయంలో ఒక్కసారి చూడాలన్న కోరిక కలిగింది గాని అది కాని పని ! యింకా ఆలోచిస్తూ అలాగే నిలబడి వున్నాడు.

మామగారి ముఖంలో చెప్పలేని ఆనందం కనబడుతూంది. ముఖం అంతా గంభీరంగా సంతోష చిహ్నాలతో నిండి వుంది. వాటికి తోడు యింకా ఏవో కొన్ని భావాలు కూడా కలిసి వున్నాయి. ఆ సమయంలో విచారానికి ఏ కొద్ది తావూ లేకపోయినా అక్కడక్కడ ఆ సూచనలు ఆయనలో లేకపోలేదు. ఆయన చేతుల్లోని పంచాంగం ఒక ముసలి తాత ముఖంలా కనిపించింది. జుత్తుంతా పీచులా నెరిసిపోయి పండిపోయివుంది. చర్మం ముడతలు పడి వుంది. గడ్డాలూ, మీసాలూ అశ్రద్ధ వల్ల పెరిగి వున్నాయి. పళ్ళు వూడిపోయి నందువల్ల పెదిమలు లోపుకి ముడతలు పడి వాలి పోయి వున్నాయి. నడుం వంగిపోయి వుంది. చేతిలో ఒక కర్ర తూలుతూ వుంది. యిలా ఆయనకి వికృతమైన

ముసలిరూపం పలుకుతూ ప్రత్యక్షం అయింది. ఆ రూపం తనే ఏమో అని కూడా అతనికి భ్రాంతి కలిగించింది. తనని నవ్వుతూ పలకరిస్తూ వెక్కిరిస్తున్నట్టు అనిపించింది. ఆ రూపాన్ని చూస్తున్న కొద్దీ వార్ధక్యం రాను రానూ తననే ఆవరిస్తున్నట్టు అనుకుంటున్నాడు. తనకే గడ్డాలూ, మీసాలూ అసహ్యంగా మొలిచినట్టయింది. ఒకసారి మొహం తడిమి చూసుకున్నాడు. అబ్బే అదంతా వట్టి భ్రమ. తనకి యిప్పుడయినా వెంట్రుక పండలేదే! నలభై ఏళ్ళయినా పూర్తిగా నిండలేదే! తను క్షుణ్ణంగా ఏ కళ్ళజోడూ అవసరం లేకుండా చదవగలడు! రాయగలడు! తనింకా పేంటూ షర్టూ, కడుతున్నాడే, కొయ్యి చేగోడీలయినా నమలగలిగేట్టు దిట్టమైన పళ్ళున్నాయ్! ఎంత దూరమయినా ఆయాసం లేకుండా కర్ర పూతయినా అక్కర్లేకండా తిరిగి రాగలడే! తను ఎక్కడికయినా వెడితే కాలంలో వున్న ఆడపిల్లలు యింకా తనని చూసి సిగ్గుపడుతూంటారే! యింకో రెండు మూడు నెలలు పోతే తనకి యింకో పాపాయి పుట్టబోతూ వుంటేనే! అలాటిది తనలో ఏ లోపం వుంది! ఏ విధమైన ముసలితనం, తనలో ప్రవేశించింది? తను 'తాత' ఎలా గవుతాడు? యిలాటి ఎంతో ఆలోచనలు అతనిలో కలుగుతున్నాయి.

తిరిగి యింట్లో చిన్న పిల్లాడి ఏడుపు వినిపించింది! ఆ ఏడుపు - తాతా! తాతా!! అని తన్నే పిలుస్తున్నట్టు వున్నది! యీ మాటలు తలుచుకుంటూంటే ఒళ్ళంతా చెమట పోసింది! యింకా అలా పంచాంగం పట్టుగొని ఆలోచిస్తూనే వున్నాడు! అప్పుడే యిరుగుపొరుగుల వాళ్ళు వచ్చి పరామర్శిస్తున్నారు. వాళ్ళందరూ తననే మొహం మీదకు వచ్చి ఎగతాళి చేస్తున్నట్టు అనిపిస్తూంది. ''ఏమండోయ్ తాతయ్యగారైనారే!'' - ఛీ తను తాత ఎలాగయేడు? యీ మాత్రంలో ఎలా గవుతాడు! యింక ఎక్కడికి వెళ్ళినా తప్పదు - ''తాతగారూ! మనవడు ఎలా వుంటాడు'' అని అడుగుతారు! తెలిసిన వాళ్ళు అసలే వదలరు! యింక ఆఫీసుకి ఎలా వెళ్ళడం? ''మనవడు పుట్టేడు కదా టీపార్టీ చెయ్యరా! తాతయ్యగారూ!'' అని అంటారు. అబ్బ! ఎలాగ తప్పించుకోవడం? తనతోటి వాళ్ళే యిలా అంటూంటే ఎలా సహించడం? వాళ్ళ కన్నా తనేం వయస్సులో పెద్దా? రూపంలో లోపమా? తనతోటి వాళ్లు ఎంతమంది యింకా పిల్లలు లేకుండా వున్నారు? వున్నా యింత వేగిరం మనవలు కలగాలా? అయినా ఇది నా ఖర్మ! ఆ భగవంతుడు మొదట్లో తనకి మొగ సంతానం యిస్తే యింత వేగిరం యిలా హాస్యానికి లోను గాకుండా వుండేవాడు కాదే. తనని యిలా అందరూ ''తాతా'' అని పిలవగలిగేవారా? ఈ ఆడపిల్లలతో ఎంత వేగిరం ఎంత మార్పు వస్తుంది? అయితే తనింక తాతగారని పేరు పడవలసిందే యిది తప్పించుకొనే వుపాయమే లేదా? దీనికి తోడు తనంతట తనే అందరికీ పేరు పేరున చెప్పుగోవాలి! బంధులందరికీ వుత్తరాలు రాయాలి! తనకి మనవడు పుట్టేడనీ, తను ''తాత'' అయినాడనిన్నీ. యిహ అటునుండి జవాబులు, పరామర్శలు, యిదేమీ బావులేదు! పోనీ యిక్కడి కేదో గుప్‌చిప్‌గా యింకా అందరికీ తెలియకుండా వుంచుదామా అంటే యీ ఆడవాళ్లు వూరుకుంటారా? రాసేవరకూ పీక్కుతింటారు! దీనికి తోడు వుయ్యాలలో పెట్టడం అంటారు. అందర్ని పిలుస్తారు. యింకా తర్వాత బారసాల అంటారు. యిదో పెద్ద తంతు. పెద్ద ప్రకటన, బాజాలు, బజంత్రీలు, యింక ప్రతి మనిషికీ చెప్పుకోక తప్పదు. - - యీ బారసాల గురించి తలుచుకుంటే అతనికి చెప్పరాని

సిగ్గు వేసింది. అది తప్పనిసరి, సాంప్రదాయం, ఆచారం, తాళాలూ, మేళాలూతోసహా అందర్నీ పిలవక తీరదు. యింతో అంతో ఉద్యోగం చేస్తున్నవాడు గాబట్టి తన తోటి ఉద్యోగస్తుల్ని పిలిచి సంతర్పణచేయాలి. లేకపోతే పరువు దక్కదు. యిది ఎలాగయినా తప్పించుకో గలడా ? ఏదో సాకు చెప్పాలి. చెప్పినా యివతల యింట్లో వాళ్ళు వూరుకోరు. అవతల లోకానికి బాపుండదు. లోకం మాటకేం అటు అల్లుడి తరుపు వాళ్ళు దుమ్మెత్తి పోయరూ ! అదికాక యిది తన మొదటి కూతురు మొదటి కానుపాయె. యింక అనవసరమైన మాటలు అంటగడతారు. పిసినారి అంటారు. గర్వం అంటారు. ఇదెవడు పడే బాధ. దీనికంతటికీ ఒప్పుకుంటే - తను యిహ మీదట ఎక్కడికి వెళ్ళినా ఆ వూత పదం తప్పదు. అలా వింటూ ఎలా వూరుకోగలడు ? ఎవడు మాత్రం వూరుకోగలడు ? - - మానసికంగా గాని, శారీరకంగా గాని, స్వాభావికంగా గాని తాను యింకా ముసిలి కాలేదే ! అందువల్ల 'తాత' అనగానే అందులో ముసలితనం పలుకుతూంటే ఎలా నోరు మూసుకో గలడు ? యీ పెద్ద కూతురికి కొడుకు పుట్టడం వల్లనే కదా తను తాతగారవ వలసి వచ్చింది. తను ఏ విధంగా నయినా యీలోకం నోటిని మూయించగలడా ? తనలాగే యింకా ఎంతమంది మనవలిని చూసి సంతోషించలేదు? వాళ్ళందరూ ఏం చెయ్యలేక వూరుకున్నారా ? అయినా తను ఏం చెయ్యగలడు ? తనకేమీ ? అందరూ అనుకున్నంత మాత్రంలో? - కాని తన అభిమానం కొంచం అడ్డొస్తూంది ? తను యిలా ఆలోచిస్తూండగా ఆయన భార్య వచ్చి ''చూశారా! నక్షత్రం ఏమిటో ?'' అని అడిగింది. రామం ఆతృతతో యిటువేపు వచ్చి చెవులు పెద్దవి జేసి వింటున్నాడు. అతనికి అప్పుడు జ్ఞప్తికి వచ్చి - మెల్లగా అన్నాడు.

''జ్యేష్ట నక్షత్రం వోయ్! యిప్పుడు నువ్వు చూడ్డానికి పనికిరాదు'' అన్నాడు.

యీ ముక్క వినగానే అంత ఆశతో వింటున్నవాడూ నిలువునా నీరయిపోయినాడు. రామం గుండెల్లో రాయి పడింది. తను ఎంతో ఉల్సాహంతో కాచుకు కూర్చున్నందుకు యిలా అవుతుందని అనుకోలేదు. ఒక్కసారి కళ్ళంట నీళ్ళు గిర్రున తిరిగాయి. తన ఆవుకు పెయ్యి పుట్టగానే అది సాకడం తను సంరక్షణ చేయడము, యివన్నీ కళ్ళకు కట్టినట్టు జ్ఞాపకానికి వచ్చేయి. రామం మాట్లాడలేక పోయాడు. ఎంత వేగిరం చూద్దామా అని మురిసిపోయి, చాలా వేగంతో ముందుకి పొంగుతూ వస్తూన్న అభిమానాన్ని అణుచుకుంటూ చేసేదిలేక అక్కడే బల్ల మీద కూర్చుండిపోయేడు. వళ్ళంతా చెమట పోసింది. అయినా తన భావాలిని పైకి కనబడనీయలేదు.

''ఏ నక్షత్రం అయితే నేం తల్లీ పిల్లా కులాసాగా వున్నారు ! అంతే చాలు ! యిప్పుడు గాకపోతే శాంతి చేసుగున్నాక చూడవచ్చు !'' అని అత్తగారు అంటూనే వుంది. యీ మాటలు వినీవినబడనట్టు రామం చెవుల్లో పడ్డాయి.

''పోనీ అది కులాసాగా వుంది కదా !'' అని మనస్సు స్తిమితం చేసుకున్నాడు. గాని పిల్లాడెలా వున్నాడో అన్న ఆతృత ఎక్కువౌతూనే వుంది. యీ సమయానికి ''నల్లగా నీలాగే వుంటుంది'' అన్న తన మాటలు జ్ఞాపకానికి వచ్చి నవ్వుకున్నాడు. మామగారు జాతకం రాయించడానికి దైవజ్ఞుడి దగ్గరికి వెళ్ళినట్టుంది.

సమయానికి అక్కడ వున్న రామానికి ప్రయోజనం లేకపోయింది. సరికదా సాయంత్రం బండి వేళ వరకూ భార్యతోనైనా మాట్లాడడానికి వీలులేకపోయింది. వాళ్ళు గదులలో వాళ్ళు చాలా తొందరగా వున్నారు. ఆ తర్వాత అత్తగారు స్వయంగా వచ్చి చెప్పేసింది కూడాను. శాంతి చేసుకున్న తరువాత మాడవచ్చని యిహను తను ఏం చెయ్యగలడు? ఆమెతోనైనా మాట్లాడి కష్టసుఖాలు చెప్పుగుందామని సర్వవిధాల ప్రయత్నించినా లాభం లేకపోయింది. బరువెక్కిన మనస్సుతో ఏమీ తోచక ఆ సాయంత్రం వెళ్ళిపోయాడు.

పదకొండురోజుల సెలవునాటి బారసాలలో శాంతి చేసుకోవచ్చునని అంతవరకూ ఓపికపట్టాడు. రోజులు చాలా తాపీగా నడుస్తున్నట్టున్నాయి. పదకొండో రోజు దగ్గిర పడుతూండగానే అతనికి ఆతృత ఎక్కువయింది.

పిలుస్తారు కదా సెలవు పెట్టి, తగిన ఏర్పాట్లన్నీ చేసుకున్నాడు ముందుగానే. సెలవు పుచ్చుకున్నాడు. ఐతే పదకొండో రోజుకి ముందుగా యీయన్ని రమ్మనమని కబురుగాని ఉత్తరంగాని లేకపోగా పదకొండో రోజునే ఒక ఉత్తరం వచ్చింది. మామగారి దగ్గరనుండి. తను యిప్పటికే ఎంతో నిరాశతో మనస్సు పాడయిపున్నాడు. ఆ ఉత్తరం చిరాకుతోనే విప్పి చదివేడు. పదకొండో రోజు లక్ష్మివారం అవటంవల్ల ఆ వూళ్ళో ఆఫీసులకి శెలవులేదని ఆ రోజుని ఎవరూ వచ్చే అవకాశంలేదని ఆ వూళ్ళో వున్న తర్వాత ఎరిగిన వాళ్ళందరినీ పిలవకపోతే మర్యాదగా వుండదుగనుక యీ రోజున చెయ్యలేదని 21 రోజు ఆదివారం పద్ధతిగనుక ఆనాడు తప్పకుండా చేస్తామని'' రాసి వుంది.

యిది చదివిన రామానికి ఒళ్లెరుగని కోపం వచ్చింది. తన అవస్థ వాళ్ళకేం తెలుసు'' అయినా వూళ్ళో వాళ్ళు రారని మధ్య మన కార్యం ఆపుకోవడం ఏం సబబు? ఆ మొహమాటాలెందుకు? ఇంతకీ ఎవర్ని అని ఏం ప్రయోజనం. ఆ భగవంతుడు ఆ జ్యేష్ఠ నక్షత్రాన్ని ఎందుకు పుట్టించవాలి. ఆ నక్షత్రానికే ఎందుకిన్ని ''రూల్సు'' పెట్టాలి? అని అనుకున్నాడు. అతనికి దేమీ నచ్చకపోయినా పోనీ వాళ్ళకేం యిబ్బందులు వున్నాయో! అనీ వూరుకున్నాడు. సెలవు నాలుగు రోజులూ యింట్లోనే ఆలోచిస్తూ కూర్చున్నాడు... అత్తగారింటికి వెళ్ళడడానికి మనస్సు ఒప్పలేదు. తీరా ఇప్పుడు ఈ సెలవు ఖర్చు చేసుకున్నాక మళ్ళీ యిరవై ఒక్కటి నాటికి సెలవు యిస్తారో ఇవ్వరో అన్న భయం కలిగింది. ఏది ఎలా వున్నా అదృష్టం కలిసిరావొద్దూ. తిరిగి ఆ నాటికి సెలవు కావాలని రాసుకున్నాడు.- - తన ఆతృత ఎక్కువౌతున్న కొద్దీ అవతల నుండి పిలుపు ఆలశ్యం అవుతూనే వుంది. శనివారం వరకూ ఏ ఉత్తరమూ లేదు. అతడు మళ్ళీ నిరాశ చేసుకున్నాడు. యిలా చెయ్యడానికి వాళ్ళ వుద్దేశం ఏమిటో బోధపడలేదు. ఎలాగవుతేనేం ఆ సాయంత్రం వచ్చింది శుభలేఖ. అప్పటికే బళ్ళూ లేవు. అన్నీ వెళ్ళిపోయినాయి. అయినా ఏ బస్సులోనో పోవచ్చు. ఎవరయినా యింత ఆలశ్యంగా కబురు చేస్తారా? ఏమిటి యిందులో వున్న అభిప్రాయం? ఈ ఉత్తరం ఏనాటికి అందుతుందో వాళ్ళకు తెలీదూ? ఛీ యింత ఖాతరు లేకపోవడమా? వెంటనే ఆఫీసుకి వెళ్ళేడు. అక్కడ తన పేరని కవరు వుంది. దాంట్లో - ''తన చోట్లో పని చెయ్యడానికి మరో మనిషి లేకపోవడం చేత సెలవు యివ్వలేదని'' వుంది. అది చదివి రామం నిలువునా కూలిపోయాడు. అక్కడ నుండి అతివేగిరం ఇంటికొచ్చేశాడు.

ఆ ఆవేదనకి గుండె పగిలిపోతుందా అని అనిపించింది అతనికి. ఆ రాత్రి అతడు నిద్ర పోలేదు. వెర్రి వాడిలా ఆలోచిస్తూ కూర్చున్నాడు. ఎన్ని విధాలో అనని తాను నిందించుకున్నాడు. ఏడ్చేడు. కాని ఏం లాభం?.. ఈ విషయం ఆ మట్టున ఉద్యోగం లోంచి మానేసి వెళ్ళిపోదామా అని అనిపించింది. కాని కొంచెం ఆలోచించి శాంతించాడు. మరి చేసేది లేక ఉత్తరం రెండుముక్కలు రాసి పడేసేడు. తనకి సెలవు లేదు రాలేనని! ఏది ఏలాగయినా నెంకో దినం తక్కువ చేసి బారసాల. శాంతి చేసిపరాలని''

ఈ ఉత్తరం వెళ్ళిన తర్వాత తనకి ఏ జవాబూ రాలేదు. అయినా కూడా రామం గట్టిగా ఆఫీసరుకీ నచ్చచెప్పి సెలవు తీసుకొని ఎంతకూ ఏ ఫికరూ లేకపోవడంవల్ల తన ఆతృతని అణచుకోలేక, వాళ్ళు పిలిచేదేమిటని బయలుదేరి వెళ్ళిపోయాడు!

యీాయన్ని చూసి ఆయన అత్తగారు నివ్వెరపోయారు. వాళ్ళు ఎప్పుడూ యిలా పిలవకుండా వచ్చేస్తాడని అనుకోలేదు.! ఇతను వచ్చేకయినా వాళ్ళు ఏ ప్రయత్నాలూ చెయ్యలేదు! సరికదా ఆ పూసే ఎత్తకుండా ఎప్పుడూ వచ్చినపుడు సత్కరించినట్టే సత్కరించి ఊరుకున్నారు. యిది చూసి రామం ఆశ్చర్యపోయాడు. శాంతం అన్నది ఏ కోశానా లేకుండాపోయింది. అయినా యింకా ఆ పీగానే ఉన్నాడు. గంటలు దాటిపోతున్నాయి. ప్రొద్దుట పదిగంటలయింది. అంతవరకూ వచ్చేక ఏమన్నా లాభం లేదని ఊరుకున్నాడు. మామగారు భోజనానికి రమ్మన్నారు! ''నేరాసిన ఉత్తరం అందలేదా?'' అని అప్పుడడిగేడు. యితడిని చూసి అతనేమనుకున్నాడో ఏమో! ''నెంకో దినం తక్కువ చేసి బారసాల చెయ్యడం వాళ్ళ కుటుంబానికి అచ్చిరాదనీ, అలా యింతకు పూర్వం వాళ్ళెవరూ చెయ్యలేదని, అందువల్ల యిప్పుడు చెయ్యడానికి వీలులేదని యిదో ఆనవాయితీ అని చెప్పి ఊరుకున్నారు. యిక రామం సంగతి చెప్పాలమా? అతనికి యిదంతా ఏదో ఆలోచించుకు చేసిన దానిలా కనిపించింది! లేకపోతే మొదటిసారి. పూళ్ళో వాళ్ళు రారని మానివెయ్యటమేమిటి? రెండోసారి వ్యవధి ఏమాత్రం లేకుండా ఉత్తరం రాయడం ఏమిటి? అది తనను ఏదో విధంగా ఆపి వేయడానికి కాదూ? యిప్పుడు ఈ మూడోసారి అచ్చిరాదని ఒక్కముక్కలో వదిలించుకోడం, దేనికి? యిదంతా ఏమిటో అతనికి అర్థం కాలేదు. కాని యిలా చెయ్యడానికి కారణం ఏమిటో అతనికి ఎంత ఆలోచించినా బోధపడలేదు. యిలా యితను ఆలోచిస్తూ నిలబడిపోగా అతని అత్తగారు వచ్చి,

''రా నాయనా భోజనానికి! మరి అడ్డు తగిలినపుడు ఏం చేస్తాం. మాకు మాత్రం తెలీదూ? నీ ఆతృత. ఈ మాటికిలా అయిపోయింది. ఏమీ అనుకోకు, యిదయిన తర్వాత మూడోనెల వచ్చేవరకూ బారసాల చెయ్యకూడదు. అప్పుడు శుభలేఖ రాస్తాం. అంతవరకూ ఓపిక పట్టక తీరదు'' అని చల్లగా చెప్పేసింది.

ఈ మాటలు విన్న రామం వెంటనే మరి విచక్షణ చేయకుండా, బయలుదేరాడు స్టేషనుకు. వెనకాలే ''భోజనం చెయ్యకుండా యిప్పుడెక్కడికి వెడుతున్నావు'' అన్న ముక్కలు నాలుగయిదుసార్లు వినబడ్డాయి గాని రామం జవాబు చెప్పకుండానే తిన్నగా వెళ్ళి బండి ఎక్కాడు. బండి కదిలిపోతుండగా

తన మామగారు గబగబా స్టేషన్‌కి వస్తున్నట్టు చూశాడు! తన కళ్ళంట నీళ్ళు కమ్మడం వల్ల మరేమీ అగుపించలేదు. తను ఎంత ఆలోచించినా, వాళ్ళు ప్రయత్నపూర్వకంగానే బారసాల చెయ్యలేదని మాత్రం గ్రహించాడు గాని, అందుకు కారణం తాతగారేనని ఊహించలేకపోయేడు.

★ ★ ★

(ఆంధ్రప్రభ, దినపత్రిక 5-4-1953)